సాక్షి పార్వతీపురం మన్యం

సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



వాహనాలకు హై సెక్యూరిటీ..!

వాహనాలకు సెక్యూరిటీ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాత, కొత్త వాహనాలు తేడా లేకుండా ప్రతి వాహనానికి హైసెక్యూరిటీ నంబరు ప్లేటు బిగించాలని ఆదేశించింది. - 8లో



వాలీబాల్ పోటీలు ప్రారంభం

యువత వ్యక్తిత్వ వికాసంతో పాటు ఉజ్వల భవిష్యత్‌కు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. - 8లో

వయోపరిమితి పెంపుపై హర్షం

విజయనగరం టౌన్: రాష్ట్రంలో అగ్రవర్ణ పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను ఐదేళ్ల పొడిగించడం, ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీపడే అభ్యర్థులకు వయోపరిమితి ఐదేళ్లు సడలించడం హర్షణీయమని ఓసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సత్తి అచ్చిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు అమలు చేస్తున్నప్పటికీ ఏ రాష్ట్రం వయో పరిమితిని సడలించలేదని తెలిపారు.

న్యూస్‌రీల్

రూ.19.20 కోట్ల విడుదల

● డ్వామా పీడీ రామచంద్రరావు



డ్వామా పీడీ రామచంద్రరావు

పార్వతీపురం టౌన్: ఉపాధి హామీ పథకంలో 2021 – 22 సంవత్సరానికి సంబంధించి రూ.19.26 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని డ్వామా పీడీ రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో చేసిన పనులకు సంబంధించిన బిల్లుల జాప్యం జరగకుండా బిల్లులు అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించామని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో 3900 పనులు జరిగాయన్నారు. వాటిని అప్‌లోడ్ చేయడంలో సాంకేతిక లోపాలు తలెత్తినట్లయితే వివరాలను తెలియజేయాలన్నారు. రూ.19.20 కోట్లు చెల్లించాల్సి ఉందని వాటిని తక్షణమే చెల్లింపులు జరిగేలా ఏపీఎలు, ఇంజినీరింగ్ కన్సల్టింగ్‌లకు ఆదేశించామన్నారు.

ముందస్తు చర్యలు

పార్వతీపురం టౌన్: పాడి పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టామని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ఈశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1 నుంచి జిల్లా వ్యాప్తంగా వీటికి టీకాలు వేయనున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో ఆవులు, ఎద్దులు 2.29లక్షలు, గేదెలు 0.47 లక్షలు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటికీ మందులు వేసేలా వ్యాక్సిన్ సిద్ధంగా ఉందన్నారు. ప్రతి మండలంలోని పశువైద్య కేంద్రాల పరిధిలో వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు పేర్కొన్నారు. జిల్లాలో 2.07 లక్షల గొర్రెలు, 1.73 లక్షల మేకలు ఉండగా 30 శాతం వరకు పీపీఆర్ వ్యాక్సిన్ వేసినట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని గొర్రెల కాపరులు సమీప పశువైద్య సహాయకుడిని కలిసి టీకాలు వేయించుకోవాలని సూచించారు.

నూతన కార్యవర్గం



ఎంపికైన బధిరుల నూతన కార్యవర్గం

విజయనగరం టౌన్: విజయనగరం జిల్లా బధిరుల అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా పడాల మహేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా ఎల్.సత్యన్నారాయణ, ఎస్ సాగిఅప్పలవర్మ, జి.శివకుమార్ ఎంపికయ్యారు. వీరితో పాటూ ప్రధాన కార్యదర్శిగా జి.గణపతి, కోశాధికారిగా మంగునాయుడు కశిరెడ్డి, మహిళా కార్యదర్శిగా జమ్ము ఆశాజ్యోతి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎంపికయ్యారు. అసోసియేషన్ అభివృద్ధికి తామంతా పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నిరంతర ప్రక్రియగా పుస్తకాల సేకరణ



దాత నుంచి పుస్తకాలను అందుకుంటున్న గ్రంథాలయ సేవా సంఘం ప్రతినిధులు

విజయనగరం అర్బన్: గ్రంథాలయాల కోసం పుస్తకాల సేకరణ నిరంతర ప్రక్రియగా 'పుస్తక హుండీ' పేరుతో చేపడుతున్నామని జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కె.దయానంద్ అన్నారు. స్థానిక ఉడా కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు నుంచి సేకరించిన పుస్తకాలను ఆదివారం సంఘం సభ్యులు స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పుస్తక పఠనం పెంపొందించేందుకు గ్రంథాలయాలను ప్రజలకు చేరువ చేసేందుకు తమ సంఘం కృషి చేస్తుందని అన్నారు. ఇళ్లలో వృథాగా ఉన్న పుస్తకాలను అవసరమైన వారికి అందజేయాలన్న ఆలోచన తో పుస్తక హుండీ చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, మాజీ కార్యదర్శి ఆర్.బాలకృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు హోం హెల్త్ కేర్‌లో శిక్షణ

విజయనగరం అర్బన్: గాయత్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ అండ్ మెడికల్ టెక్నాలజీ, సెంచూరియన్ యూనివర్సిటీ, స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ సంయుక్తంగా ఐదు నెలల హోం హెల్త్ కేర్ అసిస్టెంట్స్ కోర్సులో ప్రవేశాలకు దివ్యాంగుల నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు జీవీబీ జగదీష్ ఆదివారం తెలిపారు. పదో తరగతి చదివిన 17 – 35 ఏళ్లలోపు వయసున్న నిరుద్యోగులైన శారీరక విభిన్న ప్రతిభావంతులు, తక్కువ వినికిడి లోపం ఉన్నవారు వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 8985953000 నంబరును సంప్రదించాలని సూచించారు.

'ఏకలవ్య' పిలుస్తోంది

గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి సంబంధించి ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రకటన వెలువడింది. గిరిజన విద్యార్థులకు ఇది ఒక వరంగానే చెప్పొచ్చు. అయితే ప్రవేశాలకు పరీక్షలో అర్హత సాధించాల్సి ఉంటుంది. మెరిట్ విద్యార్థులకు అవకాశం లభిస్తుంది.



భామినిలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల

- ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- జిల్లాలో 6 ఈఎంఆర్‌ఎస్‌లలో 360 ఖాళీలు
- 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్లు ఖాళీల భర్తీ
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు

సీతంపేట: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలంటే క్రమశిక్షణకు నిలయాలు. అన్ని రకాల వసతులు, హంగులు కార్పొరేట్ తరహాలో ఉంటాయి. సీబీఎస్‌ఈ బోధనతో విద్యను కూడా అదే స్థాయిలో అందిస్తాయి. 6 నుంచి 12వ తరగతి వరకు తరగతులు ఇక్కడ నిర్వహిస్తారు. ఎక్కువ మంది గిరిజన విద్యార్థులు ఈ పాఠశాలల్లో చేరడానికి ఇష్టపడతారు. అయితే ఇక్కడ సీటు రావాలంటే ప్రవేశపరీక్ష తప్పనిసరిగా రాయాల్సి ఉంటుంది. రెండు రోజుల క్రితం రాష్ట్ర గిరిజన గురుకుల సొసైటీ ఆరో తరగతిలో ప్రవేశాలకు ప్రవేశ ప్రకటన విడుదల చేసింది. 2023 – 24 విద్యా సంవత్సరానికిగాను ఆరో తరగతిలో ప్రవేశాలకు, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేయనున్నారు. ఆన్‌లైన్ ద్వారా గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. రాత పరీక్షలో పొందిన మార్కులు ఆధారంగా రిజర్వేషన్ ప్రకారం ప్రవేశం కల్పించనున్నారు.

కో – ఎడ్యుకేషన్‌లో 30 మంది బాలురు, 30 మంది బాలికలను జాయిన్ చేసుకోనున్నారు. మిగులు సీట్లు పరిశీలిస్తే జీఎల్‌పురంలో 8, 9వ తరగతిలో బాలురకు ఒక్కో సీటు ఖాళీ ఉంది. కురుపాంలో 7వ తరగతిలో బాలికలకు 8, బాలురుకు మూడు ఖాళీలున్నాయి. అలాగే 8వ తరగతిలో బాలురు 1, 9వ తరగతిలో బాలురు 7, బాలికలు 3 ఖాళీలున్నాయి. భామినిలో ఏడో తరగతిలో బాలురు 2, తొమ్మిదిలో బాలురు 1 ఖాళీ ఉన్నాయి. కోటికపెంటలో ఏడో తరగతిలో 14 బాలురు, బాలికలు1, 8వ తరగతిలో బాలురు 7, తొమ్మిదో తరగతిలో బాలికలు 6, బాలురు 8 ఖాళీలున్నాయి. మెళియాపుట్టిలో 7వ తరగతిలో బాలికలు 3, బాలురు 2, తొమ్మిదిలో బాలికలు 3 ఖాళీలున్నాయి.

అర్హతలివీ...

ఆరో తరగతిలో ప్రవేశం కోరే బాలబాలికలు 2022 – 23 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ఏదైన ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూల్లో చదివి ఉండాలి. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థి ఇంటి వద్దే 5వ తరగతి చదివిన వారు అర్హులే. అయితే తల్లిదండ్రుల డిక్లరేషన్ ఉండాలి. తెలుగు మీడియం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రంలోని గిరిజన విద్యార్థులందరికీ నిర్దిష్ట రిజర్వేషన్ లేకుండా మెరిట్ ప్రకారం సీట్లు అందుబాటులో ఉంటాయి. విద్యార్థికి సంబంధించిన జిల్లాలో ఏకలవ్య పాఠశాలలు లేకపోతే సమీపంలోని ఏకలవ్య విద్యాలయంలో చదవడానికి అర్హులు. అలాగే 30 శాతం సీట్లు మెరిట్ ఆధారంగా స్థానిక జిల్లా, తాలుకా, మండలం వారికి మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తారు.

సీట్ల వివరాలు...

విద్యాలయం	సీట్లు
భామిని	60
మెళియాపుట్టి	60
అనాసబద్ర	60
కోటిక పెంట	60
కురుపాం	60
గుమ్మలక్ష్మీపురం	60

60 సీట్లలో 48 సీట్లు గిరిజన బాలబాలికలకు, 3 సీట్లు ఆదివాసీ గిరిజనులకు, మరో 3 సీట్లు డీనోటిఫైడ్/ సంచార/పాక్షిక సంచార గిరిజనులకు కేటాయించారు. 6 సీట్లు తీవ్రవాదుల దాడుల్లో తల్లిదండ్రులు కోల్పోయిన విద్యార్థులకు, ప్రాణాలు కోల్పోయిన పోలీసు, పారా మిలటరీ, సాయుధ దళా సిబ్బంది పిల్లలకు కోవిడ్ వలన తల్లిదండ్రులు కోల్పోయిన వారికి, తండ్రిని కోల్పోయి కేవలం తల్లి సంరక్షణలో ఉన్న వారికి అనాథ విద్యార్థులకు, విద్యాలయానికి భూమి ఉచితంగా ఇచ్చిన దాతల పిల్లలకు కేటాయించారు. ఇవి కూడా రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా భర్తీ చేయనున్నారు. ఈ సీట్లకు గిరిజన విద్యార్థులే కాకుండా మిగతావారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 60 సీట్లలో 5 శాతం సీట్లలో విభిన్న సామర్థ్యం ఎస్టీ విద్యార్థులకు కేటాయించారు.

ముఖ్యమైన తేదీలు

దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ:	15.04.2023
రాత పరీక్ష	30.04.2023
మెరిట్ జాబితా	10.05.2023
తుది జాబితా	17.05.202

ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినప్పుడు ప్రాధాన్యత క్రమంలో 28 ప్రాధాన్యతలు నింపాల్సి ఉంటుంది. విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, దివ్యాంగులైన విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొన్న ధ్రువీకరణ పత్రం (తప్పని సరికాదు), పాస్‌పోర్ట్‌సైజు ఫోటోలు 2 ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్ష దాటకుండా ఉండాలి. తెలుపు రేషన్ కార్డు ఉన్న వారు ఆదాయ ధ్రువపత్రం అవసరం లేదు. రాత పరీక్ష 6వ తరగతికి వంద మార్కులకు, 7, 8, 9 తరగతులకు 200ల మార్కులకు తెలుగు, ఆంగ్ల మీడియంలో ఉంటుంది.

జిల్లాలో రాత పరీక్ష కేంద్రాలు

సీతంపేట బాలికల గురుకులం, పి.కోనవలస బాలుర పాఠశాల, జీఎల్‌పురం ఈఎంఆర్‌ఎస్, ఎస్‌వోఈ పార్వతీపురం.

మంచి అవకాశం



గిరిజన విద్యార్థులకు ఇదో మంచి అవకాశం. సద్వినియోగం చేసుకోవాలి. గతంలో వలే కాకుండా రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యాలయాల్లో ఎక్కడైనా విద్యార్థి దరఖాస్తు చేసుకోవచ్చు. ఒకే జిల్లా కాకుండా పక్క జిల్లాకు వెళ్లవచ్చు. ప్రతీ విద్యార్థి 5 ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు.

– కె.సురేష్, ఏకలవ్య మోడల్ స్కూల్స్ స్టేట్ కన్వీనర్

కరుణించి.. కాపాడు కనకమహాలక్ష్మి

- ప్రారంభమైన శ్రీకనకమహాలక్ష్మి 25వ జాతర మహోత్సవములు
- ప్రత్యేక ఆకర్షణగా అమ్మవారి సైకత చిత్రం
- మొక్కులు సమర్పించుకున్న వేలాది మంది భక్తులు

చీపురుపల్లి:

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 25వ జాతర మహోత్సవములు వైభవోపేతంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న అమ్మవారి జాతరను తెల్లవారుజామున ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, కమిటీ సభ్యులు తొలి పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం తెల్లవారుజామున 2 గంటల నుంచి భక్తులకు అమ్మవారిని దర్శించుకునేందుకు అనుమతిచ్చారు. అప్పటికే క్యూలైన్లలో బారులు తీరి ఉన్న భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. విజయనగరం, విశాఖపట్టణం, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు రావి చెట్టు, ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం కోళ్లు, గొర్రెలను మొక్కుతూ, పసుపు, కుంకుమలు సమర్పించుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా సైకత చిత్రం

ఈ ఏడాది అమ్మవారి ఆలయం ఎదుట ఆవిష్కరింపబడిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి సైకత చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జాతర సందర్భంగా అమ్మవారిని సైకత చిత్రంగా రూపొందించడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఫొటోలు తీసుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

అమ్మవారిని ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి దంపతులు, డా.బొత్స సందీప్, పూజిత దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి దేవదాయ ధర్మాదాయ శాఖ ఈఓ జి.శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్ససత్యనారాయణ పట్టు వస్త్రాలు, పూజా సామగ్రి సమర్పించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతులతో బాటు వారి కుమారుడు మోహిత్, కమార్తె సిరిసహస్ర, అల్లుడు ప్రదీప్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శ్రీదేవి దంపతులతో బాటు కుమారుడు బెల్లాన వంశీకృష్ణ, పావని దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.



పూజలందుకుంటున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



పూజల్లో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అమ్మవారి సైకత చిత్రం

ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన ఫిజిక్స్ పరీక్షకు 1466 మందికిగాను 1342 మంది హాజరయ్యారు. 124మంది గైర్హాజరయ్యారు. కెమిస్ట్రీ 900 మందికిగాను 783 మంది హాజరయ్యారు. 117 మంది గైర్హాజరయ్యారు. బోటనీ 2287 మందికిగాను 2117 మంది హాజరయ్యారు. 171 మంది గైర్హాజరయ్యారు. జువాలజీకి సంబంధించి 476 మందికిగాను 446 మంది హాజరయ్యారు. 30 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఫస్ట్ ఇయర్ ఒకేషనల్‌కి సంబంధించి 3687 మందికిగాను 3252 మంది హాజరయ్యారు. 435 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ ఎం.సత్యనారాయణ తెలిపారు.

విజయభావన సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీ సదస్సు గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి విశ్రాంత జిల్లా న్యాయమూర్తి మంగిపూడి రాజభూషణం అధ్యక్షత వహించారు. రంగస్థలం పౌరాణిక నాటకం అనే అంశంపై పక్కి జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం గన్నవరపు వేంకట సూర్యనారాయణమూర్తి వక్తగా పాల్గొని ప్రసంగించారు. పౌరాణిక నాటకాల ప్రాభవాన్ని, ప్రభావాన్ని గుర్తుచేశారు.

బుడతడికి 'బుక్'లో చోటు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇచ్చిన పతకాలు, ధ్రువపత్రాలతో సంజీవ్‌రెడ్డి

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన బుడతడు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. తేతల భానుప్రకాష్‌రెడ్డి, శివానీల కుమారుడైన నాలుగేళ్ల సంజీవ్‌రెడ్డి తన సత్తా చాటి శభాష్ అనిపించాడు. సంజీవ్‌రెడ్డి 30 సెకనుల వ్యవధిలో భారతదేశంలోని రాష్ట్రాల పేర్లు, వాటి రాజధానుల పేర్లు చెప్పి కొత్త రికార్డు సాధించాడు. దీంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు సంజీవ్‌రెడ్డిని అభినందించి ధ్రువపత్రం, బంగారు పతకం, పుస్తకం – కలం బహుమతిగా అందజేశారు. సంజీవ్‌రెడ్డిని స్థానికులు, తల్లిదండ్రులు అభినందించారు.

వేడుకగా యల్లారమ్మ తొలేళ్ల జాతర

జామి:

ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన జామి యల్లారమ్మ జాతర తొలి రోజు తొలేళ్ల జాతర ఆదివారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న జాతరలో తొలి రోజు భక్తులు అమ్మవారిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. జాతరలో భాగంగా ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు విద్యుద్దీపలంకరణలతో సుందరంగా ముస్తాబు చేశారు.



వైష్ణవిమాత ప్రత్యేక అలంకరణతో దర్శనమిస్తున్న యల్లారమ్మ అమ్మవారు

అపరాలకూ 'మద్దతు'

అన్నదాత సంక్షేమానికి కట్టుబడి ఉన్న రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారి దిగుబడులకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు సకాలంలో చెల్లించి అండగా ఉంటోంది. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేసి 21 రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిన ప్రభుత్వం తాజాగా అపరాల కొనుగోలుకు జిల్లాలో కేంద్రాలు సిద్ధం చేస్తోంది. వీటి ద్వారా మద్దతు ధర పొందేలా చర్యలు చేపట్టింది.

- కొనుగోలుకు జిల్లాలో 16 కేంద్రాలు ఏర్పాటు
- పెసలు మద్దతు ధర క్వింటాకు రూ.7755
- మినుములు క్వింటాకు రూ.6600



పెసలు

విజయనగరం ఫోర్ట్: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన ప్రభుత్వం, ప్రస్తుతం అపరాల (పెసర, మినుము)లను కూడా కొనుగోలు చేసేందుకు సన్నద్ధమవుతుంది. అపరాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తుంది. వరి పంటకు సంబంధించి జిల్లాలో 500కు పైగా కొనుగోలు కేంద్రాలు ద్వారా ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసింది. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. ముఖ్యంగా దళారులు, మిల్లర్లు దోపిడీకి అడ్డుకట్ట వేసింది.

అపరాల కొనుగోలుకు 16 కేంద్రాలు

జిల్లాలో రైతులు సాగు చేసిన పెసలు, మినుములు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం 16 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. బొబ్బిలి పీఏసీఎస్, రామభద్రపురం పీఏసీఎస్, తెర్లాం పీఏసీఎస్, బాడంగి పీఏసీఎస్‌తో పాటు జామి రైతుశక్తి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (జామి, కొత్తవలస, ఎల్.కోట, వేపాడ), మన్యం సహజ ప్రొడ్యుసర్ కంపెనీ లిమిటెడ్ (సంతకవిటి), ప్రకృతి వనం ఫార్మర్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్ (ఆర్.ఆమదాలవలస), దత్తిరాజేరు మండలం పోరలి పీఏసీఎస్, గజపతినగరం పీఏసీఎస్, మెంటాడ పీఏసీఎస్, శ్రీ జయవినాయక ఫార్మర్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్ (గంట్యాడ)ల్లో అపరాలు కొనుగోలు కేంద్రాలు రెండు రోజుల్లో ఏర్పాటు చేయనున్నారు.

పెసలు క్వింటా మద్దతు రూ.7755

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అపరాలకు మద్దతు ధర నిర్ణయించింది. పెసలు క్వింటాకు రూ.7755, మినుములు క్వింటాకు 6600 చెల్లించనున్నారు. పెసర రబీలో 9422 హెక్టార్లు, మినుములు 18,861 హెక్టార్లలో సాగయ్యాయి. పెసలు హెక్టారుకు 5 నుంచి 6 క్వింటాళ్లు, మినుములు హెక్టార్లుకు 6 నుంచి 7 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో పెసలు క్వింటాకు రూ.7 వేలు, మినుములు క్వింటాకు రూ.6100 చొప్పన చెల్లిస్తున్నారు. రైతులు ఆయా కొనుగోలు కేంద్రాలకు మినుములు, పెసలు తీసుకుని వెళ్లి విక్రయించుకోవచ్చు.

రెండు రోజుల్లో కేంద్రాలు

జిల్లాలో అపరాలు కొనుగోలుకు 16 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. ఒకటి రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నాం. రైతులు వారి పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాలకు వెళ్లి అపరాలు విక్రయించుకోవచ్చు.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుబడిన పీడీఎస్ బియ్యం

సీతంపేట: మండంలోని మెట్టుగూడలో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీతంపేట పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావుకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు. 65 మూటలు కట్టి అక్రమంగా దాచి ఉంచిన బియ్యాన్ని సీజ్ చేశామని, పౌర సరఫరాల శాఖకు అప్పగించనున్నామని చెప్పారు.

నుజ్జునుజ్జయిన లారీ


బోల్తా పడిన పప్పుల ప్యాకెట్ల లారీ

బొండపల్లి: రాయిపూర్ నుంచి విశాఖపట్నం పప్పుల ప్యాకెట్లతో వెళ్తున్న లారీ మండలంలోని బిల్లలవలస జంక్షన్‌కు సమీపంలో జాతీయ రహదారి26 పక్కన ఆదివారం బోల్తా పడి నుజ్జునుజ్జయింది. మితిమీరిన వేగంతో వెళ్తున్న లారీ ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కన గల గుంతలోకి వెళ్లి బోల్తా పడింది. అయితే లారీ డ్రైవర్‌తో పాటు క్లీనర్ గాయాలతో బయట పడగా వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. బొండపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

రెండు బైక్‌ల ఢీ: ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన టెక్కలి వ్యక్తి

భామిని: మండలంలోని ఏబీ రోడ్డు వెంబడి ఆదివారం ఘనసర సెంటర్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. బైక్, స్కూటీ ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు.గాయాల పాలైన వారిని టెక్కలి, పర్లాకిమిడికి చెందిన వ్యక్తులుగా చెబుతున్నారు. గాయపడిన బాధితులకు స్థానికులు సపర్యలు చేసి ఆటోలో కొత్తూరు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

పశువుల పాక, గడ్డివాములు దగ్ధం


అగ్నిప్రమాదంలో కాలిపోయిన పశువుల పాక

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామ సమీపంలో కళ్లాల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పశువుల పాక, రెండుగడ్డివాములు దగ్ధమయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ సమీపంలో ఉన్న పల్లా వారి కళ్లాల్లో ఆదివారం సాయంత్రం 5గంటల సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పల్లా దేముళ్లు, గంగులుకు సంబంధించిన పశువుల పాక, రెండు గడ్డి వాములు కాలి బూడిదయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న గ్రామ సచివాలయ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బీలసతీష్ వాటర్ ట్యాంకర్లు తెప్పించి మంటలు అదుపు చేయడంలో సహకరించారు. సుమారు రూ.70వేల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹100	₹180	₹ 190

వాహనాలకు హై సెక్యూరిటీ..!

- అన్ని వాహనాలకూ నంబర్ ప్లేట్ తప్పనిసరి
- జిల్లా రవాణాశాఖ ప్రత్యేక దృష్టి
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు


వాహనదారులు తీసుకపోవడంతో కార్యాలయానికే పరిమితమైన నంబర్ ప్లేట్లు

పార్వతీపురంటౌన్: వాహనాలకు సెక్యూరిటీ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాత, కొత్త వాహనాలు తేడా లేకుండా ప్రతి వాహనానికి హైసెక్యూరిటీ నంబరు ప్లేటు బిగించాలని ఆదేశించింది. నిర్దేశిత గడువు కూడా విధించింది. ఆ తర్వాత జరిమానా విధించాలని నిర్ణయం తీసుకుంది. వాహనం పూర్తిగా కాలిపోయినా, పనికి రాకుండా పోయినా లేజర్ కోడ్ ద్వారా వాహన పూర్తి వివరాలను తెలుసుకునే వీలుంది. వాహనాల భద్రతే కాకుండా. విద్రోహ ఘటనలకు చెక్ పెట్టాలనే లక్ష్యంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం వాహనాలకు లేజర్ కోడ్ ఉన్న హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పటి ప్రభుత్వం, ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం కూడా ఈ విధానం అమలు చేయడంలో నిర్లక్ష్యం చేశాయి. వాహనదారుల నుంచి నంబరు ప్లేట్ల కోసం డబ్బు వసూలు చేసి సంబంధిత వాహన యజమానులకు అందజేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వాహనదారులు సైతం అంతే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తమ అభిరుచికి తగిన విధంగా స్టిక్కర్, డిజిటల్, గ్లాస్‌డ్ నంబర్ ప్లేట్లు వేసుకుంటున్న పరిస్థితి నెలకొంది.

పాత వాహనాలకూ ప్లేట్లు

వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు బిగించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013లో అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నంబర్ ప్లేట్ల తయారీని లింకు ఆటోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించింది. అయితే ఆ మరుసటి సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాల నంబర్ ప్లేట్లను తీసుకోకుండా నిర్లక్ష్యం కనబరిచారు. 2014 కంటే ముందు ఉన్న వాహనాలకు కూడా తప్పని సరిగా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌ను అమర్చుకోవాల్సి ఉంటుంది. ఈ లెక్కన జిల్లాలో సుమారు 5 లక్షలకు పైగా వాహనాలు ఉంటాయని రవాణా అధికారులు లెక్కలు వేస్తున్నారు.

కచ్చితంగా అమలు

గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. హైసెక్యూరిటీ నంబరు ప్లేట్లు అమర్చుకోవడానికి గత ఏడాది డిసెంబరు వరకు గడువు విధించింది. ఆ తర్వాత ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు గడువు పెంచింది. ఆ తరువాత రవాణా, పోలీసు అధికారుల తనిఖీల్లో హైసెక్యూరిటీ నంబరు ప్లేటు లేకుంటే పట్టుబడితే రూ. 1000 ఫైన్ కింద వసూలు చేయాలని రవాణాశాఖ ఆదేశించింది.

ఆన్‌లైన్ నంబర్ ప్లేట్ బుకింగ్

పాత వాహనాల యజమానులు హై సెక్యూరిటీ నంబరు ప్లేటును ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునే వీలు కల్పించారు. 2019 నుంచి వాహనాల నంబర్ ప్లేట్లును ఆయా షోరూంలకే పంపిస్తున్నారు. అక్కడే రిజిస్ట్రేషన్ అయిన ప్రతి వాహనం నంబర్ ప్లేటు బిగించుకోవాల్సి ఉంది. పాత వాహనాలకు సంబంధించి హైసెక్యూరిటీ నంబరు ప్లేటు కోసం వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్‌టీఏ సిటిజన్.ఈప్రగతి.ఓఆర్‌జిని అందుబాటులో ఉంచారు. ఈ వెబ్‌సైట్లోకి వెళ్లి నంబరు ప్లేటుకు స్లాట్ బుక్ చేసుకోవచ్చు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసినా లింకు వస్తుంది. హై సెక్యూరిటీ నంబరు ప్లేటు కోసం ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లకు రూ.245, మూడు చక్రాల వాహనాలకు రూ.282, కార్లు, తేలికపాటి మోటారు వాహనాలకు రూ.619, భారీ మోటారు వాహనా లకు రూ.649 చెల్లించాల్సి ఉంటుంది.



రవాణా వాహనం హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్

'కార్యాలయంలోనే 13,223 ప్లేట్లు

ట్రాన్స్‌పోర్ట్, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు హైసెక్యూరిటీ నంబరు ప్లేట్లను ప్రతి యజమాని అమర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిరోజూ జిల్లాలో 100కు పైగా వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతుంటాయి. 2014 ఏప్రిల్ నుంచి రిజిస్ట్రేషన్ అయ్యే ప్రతి వాహనానికి హై సెక్యూరిటీ నంబరు ప్లేటు బిగించాలని ఆదేశాలు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఆ వాహనానికి సంబంధించి హైసెక్యూరిటీ నంబరు ప్లేటు కోసం చలానా కట్టించుకుంటారు. అయితే వాహనదారులు ఆ నంబరు ప్లేట్లును తయారీదారుల కార్యాలయంలోనే ఉంచారు. వాటిని తీసుకోకుండా బద్ధకించారు. ఈ లెక్కన అప్పటి నుంచి పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు 13,223 వాహనాలకు సంబంధించి హైసెక్యూరిటీ నంబరు ప్లేట్లు తయారీదారుల కార్యాలయానికే పరిమితమయ్యాయి.

ప్రతి వాహనానికి ఏర్పాటుకు చర్యలు



ప్రతి వాహనానికి హైసెక్యూరిటీ నంబరు ప్లేటును అమర్చుకోవాల్సి ఉంది. సాధ్యమైనంత త్వరగా వాహనాలకు అమర్చుకోవాలి. తనిఖీల్లో హైసెక్యూరిటీ నంబరు ప్లేటు లేకుంటే రూ.1000 ఫైన్ విధిస్తారు. పాత వాహనాలకు లింకు ద్వారా నంబరు ప్లేటు కోసం స్లాట్ బుక్ చేసుకోవచ్చు. డూప్లికేట్ నంబరు ప్లేట్లు బిగిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా ప్రతి వాహనానికి ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తాం.

–సి. మల్లికార్జున రెడ్డి,
జిల్లా రవాణాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

- యువత అభివృద్ధికి క్రీడలు దోహదం
- జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


తూర్పుగోదావరి, శ్రీకాకుళం జట్ల మధ్య తొలి మ్యాచ్

చీపురుపల్లి: యువత వ్యక్తిత్వ వికాసంతో బాటు ఉజ్వల భవిష్యత్‌కు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. చీపురుపల్లి గ్రామ దేవత శ్రీ కనకమహలక్ష్మి అమ్మవారి 25వ జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయ సమీపంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు ఆడడం ద్వారా నిరంతరం ఆరోగ్యంగా ఉండగలరని చదువులో కూడా రాణించగలరని అన్నారు. అయితే క్రీడా పోటీలు జరిగే సమయంలో గెలుపు, ఓటములు సహజమని, ఓడిపోయినంత మాత్రాన బాధపడాల్సిన పని లేదన్నారు. ఓటమిలో ఎన్నో పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. టోర్నమెంట్‌లో అంతిమ నిర్ణయం రిఫరీలకే ఉంటుందని క్రీడాకారులు వారి సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పలాస నియోజకవర్గ పరిశీలకుడు కేవీ .సూర్యనారాయణరాజు, మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, వలిరెడ్డి లక్ష్మణ, పొన్నాడ కుమార్, రేవళ్ల సత్తిబాబు, గుడివాడ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పోటీలకు ఆరు జిల్లాల జట్లు

అమ్మవారి జాతర సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆహ్వానపు వాలీబాల్ పోటీలకు ఆరు జిల్లాల జట్లు పాల్గొన్నాయి. అందులో భాగంగానే శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, యానాం టీమ్‌లు పాల్గొన్నాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచే జట్టుకు రూ.30 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచే జట్టుకు రూ.25 వేలు, తృతీయ స్థానం రూ.20 వేలు, నాల్గవ స్థానంలో నిలిచే జట్టుకు రూ.15 వేలు నగదు బహుమతి అందజేయనున్నామని నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


సంఘటన స్థలంలో మృతి చెందిన సూర్యం


తీవ్రంగా గాయపడిన రాము

గంట్యాడ: బొండపల్లి మండలం వెదురువాడగ్రామానికి చెందిన భార్యాభర్తలు రేగిడి రాము, సూర్యం రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో సూర్యం మృతి చెందగా రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. రాము సోదరి విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెను పరామర్శించేందుకు భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్లారు. ఆమెను పరామర్శించిన తర్వాత తిరిగి వెదురువాడ వస్తుండగా మండలంలోని కొర్లాం కాటా వద్ద ముందు వెళ్తున్న 18 చక్రాల ట్రాలీని రాము ఢీకొట్టడంతో ట్రాలీ చక్రాల కిందకు బైక్ వెళ్లి పోయింది. బైక్‌వెనుక ఉన్న రాము భార్య సూర్యం అక్కడికక్కడే మృతి చెందింది. రాము రెండు కాళ్లూ విరిగిపోవడంతో చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి విజయనగరం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

విజయనగరం క్రైమ్: పట్టణంలోని టూటౌన్ పరిధికి చెందిన వ్యక్తి ఆర్థిక సమస్యలు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు సీఐ సీహెచ్ లక్ష్మణ రావు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. టూటౌన్ పరిధిలో నివాసం ఉంటున్న పప్పు సంతోష్ కుమార్ (35) కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. రోజురోజుకూ సమస్యలు పెరిగిపోతుండడంతో తట్టుకోలేక ఈ నెల 24 న పురుగు మందు తాగేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విజయవంతంగా ముగిసిన ప్రజ్ఞా వికాస్ పరీక్ష


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజ్ఞా వికాస్ పరీక్ష జిల్లాలో ఆదివారం జరిగింది. ఈ పరీక్ష ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. వెంకట్రావు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు పోరాటాల్లోనే కాదు ఇలా విద్యార్థులకు ఉపయోగకరమైన పరీక్షలు నిర్వహించడం ఎంతో అభినందియమని, ఎంతో అధికార యంత్రాంగం ఉన్న ప్రభుత్వమే ఇలాంటి పరీక్షలు నిర్వహించడానికి వెనుకడుగు వేస్తున్న తరుణంలో ఓపక్క చదువులో ముందడుగు వేస్తూ అదే తరుణంలో విద్యార్థులకు ఇలాంటి పరీక్షలు నిర్వహించడానికి ఎస్ఎఫ్ఐ నాయకులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రామ్మోహన్ రావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులలో భయాన్ని పోగొట్టి, వారిలో టాలెంట్‌ను వెలికి తీయడం కోసం ప్రతి సంవత్సరం ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్ క్లాస్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం ఈ పరీక్షను 200 సెంటర్లలో దాదాపు పదివేల మంది విద్యార్థులు రాసి విజయవంతం చేశారని తెలిపారు. ఈ పరీక్షలో జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.5000, రూ.3000, రూ.2000 నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ చంద్ర పట్నాయక్, గురజాడ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు సీహెచ్ రామకృష్ణ, సౌమ్య, పట్టణ కార్యదర్శి పి.రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు లావణ్య, సంధ్య, కిరణ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

3.25 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తి


విలేకరులతో మాట్లాడుతున్న చక్కెర కర్మాగారం ప్రతినిధులు

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఇంతవరకు 3.25 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేసినట్లు కర్మాగారం సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ.నాగేషారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి చెరకు కర్మాగారానికి వస్తోందన్నారు. ప్రతిరోజు 4,500 టన్నుల చెరకు గానుగు ఆడుతున్నామని వెల్లడించారు. కర్మాగారం పరిధిలో చెరకు పంటను నరికేందుకు మూడు పెద్ద యంత్రాలు కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. చెరకును కర్మాగారానికి రైతులు తరలించిన వారం రోజులకే వారి ఖాతాలకు నగదు జమ చేస్తామన్నారు. చెరకు పంట విస్తీర్ణం పెంచేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కూలీల కొరతను అధిగమించాలంటే రైతులు కూడా యంత్రీకరణపై అవగాహన పెంచుకోవాలని కోరారు. చెరకు పంటను సాగు చేసేందుకు అవసరమైన యాంత్రీకరణ పనిముట్లను కూడా రైతులకు కర్మాగారం ద్వారా అందజేస్తామని తెలిపారు. ఆయనతో పాటు డీజీఎం (కేన్) రమేష్‌రెడ్డి, ఏజీఎం కె.అప్పారావు ఉన్నారు.

అమృత్‌ను అభినందించిన మంత్రి బొత్స


అమృత్‌ను అభినందిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: పట్టణానికి చెందిన దివ్యాంగుడు సూరు అమృత్‌ను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అభినందించారు. ఈ మేరకు ఆదివారం చీపురుపల్లి వచ్చిన ఆయన కస్పావీధిలోని సూరు అమృత్ నివాసానికి వెళ్లి అభినందించారు. ఎస్‌వీజీ శ్రీనివాసరావు, దీప దంపతుల కుమారుడు సూరు అమృత్‌కు చిన్నప్పటి నుంచి రెండు కాళ్లు పని చేయవు. అయినప్పటికీ కష్టపడి చదివి, బీటెక్ పూర్తి చేసి అమెజాన్ వంటి దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం సాధించాడు. దీంతో అమృత్‌ను రాష్ట్ర మంత్రి బొత్స అభినందించారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బెల్లాన వంశీకృష్ణ, కింతలి మధు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులతో మహిళ ఆత్మహత్య


నిందితులను మీడియా ముందు హాజరుపర్చి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మోహనరావు

రాజాం సిటీ:

రేగిడి మండలం ఉంగరాడ గ్రామానికి చెందిన గులివిందల ధనలక్ష్మి (23) వరకట్న వేధింపులు భరించలేకే ఆత్మహత్యకు పాల్పడిందని బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన రాజాం రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జోడుబందల గ్రామానికి ధనలక్ష్మికి గత ఏడాది ఆగస్టు 5న ఉంగరాడ గ్రామానికి చెందిన గులివిందల గౌరునాయుడితో వివాహమైంది. అప్పట్లో కట్నంగా రూ. 5.50 లక్షలతోపాటు బండి కొనుగోలుకు మరో రూ. లక్ష, బంగారం, ఆడపడుచుల కట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. అయితే కొంతకాలంగా తనను వరకట్న వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు తండ్రి గణపతిరావుకు తెలిపింది. గర్భంతో ఉన్న తనను పాలు కూడా తాగనివ్వడంలేదని చెప్పడంతో తండ్రి ప్రతి నెలా రూ. 3వేలు చొప్పున కుమార్తె ఖర్చులకు ఇచ్చేవాడన్నారు. ఈ విషయంపై మృతురాలి అత్తమామలు వారించడంతో అప్పటి నుంచి డబ్బులు ఇవ్వడం మానేశాడు. ఇదిలా ఉండగా ఈ నెల 24న బ్యాంకు పని నిమిత్తం రాజాం వెళ్లి ఇంటికి వచ్చిన ధనలక్ష్మిని భర్త గౌరునాయుడు మందలించాడు. అనంతరం తన కోళ్ల ఫారానికి కోడి పిల్లలు వస్తున్నాయని చెప్పి అక్కడికే వెళ్లి రాత్రంతా ఉన్నాడు. 25న ఉదయం గౌరునాయుడు ఇంటికే వచ్చేసరికి ఎవరూ తలుపులు తెరవకపోవడంతో చుట్టుపక్కలవారంతా వచ్చి తెరిచారు. అప్పటికే ఫ్యాన్‌కు ధనలక్ష్మి ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయి ఉంది. వరకట్న వేధింపులతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించి కేసు నమోదుచేసి, ఆమె భర్తతోపాటు మామ సూర్యనారాయణ, అత్త లక్ష్మిలను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.

అపోహలకు గురికావద్దు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం టౌన్ రైల్వేస్టేషన్ సర్వీసులు రద్దుచేస్తున్నారని ఇటీవల కాలంలో సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాలు అవాస్తవమని, ఎటువంటి అపోహలకు గురికావద్దని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1908సంవత్సరంలో బ్రిటిష్ కాలంలో పార్వతీపురం, పార్వతీపురం టౌన్ స్టేషన్లను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం భారత రైల్వే ఆధునికీకరణ పేరుతో మొత్తం 1275 రైల్వేస్టేషన్లను గుర్తించిందన్నారు. అందులో పార్వతీపురం రైల్వే స్టేషన్ ఉండడం అభినందనీయమన్నారు. పార్వతీపురం పట్టణంలో రెండు రైల్వేస్టేషన్లు ఉన్నందున పలు ట్రైన్లు రెండు స్టేషన్‌లలో నిలుపుదల చేస్తున్నారని, ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా పార్వతీపురం స్టేషన్‌లోనే నిలుపుదల చేయాలని మాత్రమే రైల్వే డీఆర్‌ఎంకు అరకు ఎంపీ గొట్టేటి మాధవి, స్థానిక ఎమ్మెల్యే అయిన తాను వినతిని అందజేశామన్నారు. దాని అర్థం రైల్వేస్టేషన్‌ను మూసివేయడం కాదన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

అద్దెకు ఇవ్వబడును

■ వ్యాపారాలు అభివృద్ధి అవుతున్న గజపతినగరం మెయిన్ సెంటర్ NH26 ఆనుకొని గణేష్ కోవెల వెనుక బస్టాండ్ దగ్గర 30x60 చ॥అడుగుల స్థలములో 3 అంతస్థులు బిల్డింగ్ స్లాబ్‌వేసి అద్దెకు ఇవ్వబడును. Cont: 9333449333 [S-1156467]

PLOT FOR SALE

■ పార్వతీపురం, అడఫేశిల దగ్గర 35 సెంట్లు అమ్మకమునకు కలదు. డైరెక్ట్ పార్టీ నెంబర్ ఫోన్: 90009 51221, 99497 54067 [B-393]

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-11]

WANTED

■ సంపన్నుల ఇళ్లలో మంచాన వున్న వృద్ధులను, పేషంట్లను వారి ఇంటి వద్దనే బాధ్యతగా చూసుకొనుటకి ఆయాలు, కేర్ టేకర్స్ MF VJA కి కావలెను. Sal: 14-20K, వసతి భోజనం. 9160835559, 7815835561 [B-909]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781902]

■ అగ్రికల్చర్ ఫీల్డ్ వర్క్ చేయుటకు 10th to డిగ్రీ గల స్టాఫ్ కావలెను. జాబ్స్ (1) D.C.O – జీతం : 22 వేలు + 3 వేలు. & ఫీల్డ్ ఆఫీసర్ : జీతం : 14 వేలు + 2,500. 7680002670, 8885863691. [A-734033]

■ ప్రముఖ కంపెనీకి చెందిన హెర్బల్ ప్రొడక్ట్స్‌కు స్టాకిస్టులు/డిస్ట్రిబ్యూటర్స్ మండలాల వారిగా కావలెను. ఆకర్షణీయమైన కమీషన్ కలదు. సంప్ర : 96037 29554 [L-794260]

■ Corporate బ్యాంక్‌లలో పనిచేయుటకు Cashiers, Clerks,Senior Officer, (Sales) Attenders కావలెను. జీ: 12,000 -40,000 వరకు. ✆ 9642506425, 8297797197. [T-4032]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233, 7036235766. [M-1190581]

■ E.G.P. స్కూల్ నందు పనిచేయుటకు టీచర్స్ (ఫ్యామిలీ) మరియు వంట చేయుటకు (ఫ్యామిలీ), వంటవాళ్ళు (Christians) కావలెను. కుంటినవలస, మెంటాడ (మం),VZM. Ph: 8555024880, 9985693480. [C-789377]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/ పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్ నర్సులు, వంటవారు, Rmp Dr. Q-5th-డిగ్రీ, 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. ఫోన్ : 7995365999 [HA-1030]

■ లేపాక్షి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి+ భోజనం. జీతం: 20K ఏజెంట్ కమీషన్ 5K. ఫోన్ : 9640300074 [HA-1019]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.